సాక్షి రంగారెడ్డి

గురువారం ▪ 27 ▪ ఫిబ్రవరి ▪ 2025



బరిలో ఉందామా.. వద్దా?

రాజకీయం అంటే ఖద్దరు కాదు.. దాని వెనక దాగున్న కథలు వింటే ఎవరికైనా అయ్యో అనిపించక తప్పదు.

8లో▸



మరోసారి భూసేకరణ

శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా మరోసారి ప్రభుత్వం భూసేకరణ చేయనుంది.

8లో▸



విధులకు డుమ్మా..

మూడు నెలలుగా విధులు వెళ్లకుండా.. ఓ టీచర్ నెలనెలా వేతనం తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.

8లో▸

న్యూస్‌రీల్

నకిలీ విజయ బ్రాండ్‌లను నమ్మకండి



విజయ తెలంగాణ పాల ప్యాకెట్‌ను చూపిస్తున్న అమిత్‌రెడ్డి

లాలాపేట: విజయ తెలంగాణ పేరుతో ఉన్న పాలు, పాల పదార్థాలను మాత్రమే కొనుగోలు చేయాలని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి వినియోగదారులకు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి 'విజయ బ్రాండ్, లాఫింగ్ కౌ సింబల్‌ను అనధికారికంగా బ్రాండింగ్ అంశాలను అనుకరిస్తూ మార్క్స్ చట్టం కింద స్వయం ప్రతిపత్తితో పని చేస్తున్నటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జిల్లా యూనియన్లు ప్రైవేట్ డెయిరీలు తెలంగాణలో చట్టవ్యతిరేకంగా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నాయని, ఇది సరికాదని హితవు పలికారు. ప్రతినిత్యం 75 వేల నుంచి 80 వేల లీటర్ల వరకు అమ్ముతున్నారని, దీంతో ప్రభుత్వ రంగ సంస్థ విజయ తెలంగాణ డెయిరీకి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందన్నారు. జిల్లా యూనియన్లకు తెలంగాణలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు లేవన్నారు. కొన్ని గుర్తింపు లేని డెయిరీల ద్వారా ఉత్పత్తి చేసిన పాలను విజయ బ్రాండ్ పేరుతో తెలంగాణలో విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని తలపెడుతున్నాయని తెలిపారు. నకిలీ విజయ బ్రాండ్ పాలు, పాల ఉత్పత్తులపై వాట్సాప్ నెంబర్ 91211 60569కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు గుత్తా అమిత్‌రెడ్డి సూచించారు.

నేడు బీఎంఆర్‌పీఎఫ్ ఆవిర్భావ సభ

సాక్షి, సిటీబ్యూరో: భారత్ మైనారిటీస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్(బీఎంఆర్‌పీఎఫ్) ఆవిర్భావ సభ గురువారం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది. ఈ సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు బీఎంఆర్‌పీఎఫ్ వ్యవస్థాపకుడు సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు.

మోకిలలో కారు బీభత్సం

- రెండు బైక్‌లు, లారీని ఢీకొట్టిన వైనం
- అపస్మారక స్థితిలో ఇద్దరు బైక్ ట్యాక్సీ డ్రైవర్లు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

శంకర్‌పల్లి: అతివేగం.. అజాగ్రత్తగా నడపడంతో కారు అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అపస్మారకస్థితిలో ఉండగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఎ.సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి రాజేంద్రనగర్ పరిధి వట్టినాగులపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి, మల్లేశం కలిసి శంకర్‌పల్లికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో అతివేగంగా వెళ్తుండగా మోకిల విజేత సూపర్ మార్కెట్ ఎదుట ఇద్దరు ద్విచక్రవాహనదారులను ఢీకొడుతూ ముందుకెళ్లి ఓ లారీని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కొండాపూర్‌కు చెందిన శ్రీనివాస్(30), లింగంపల్లికి చెందిన చంద్రసింగ్(31) బైక్‌పై నుంచి అమాంతం గాల్లోకి ఎగిరి కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రులు ఇద్దరూ అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. కారు నడుపుతున్న సురేందర్‌రెడ్డి పరారవగా మిగిలిన ముగ్గురు గాయాలతో చికిత్స పొందుతున్నారు. గాయపడిన ద్విచక్రవాహనదారులు ర్యాపిడో, జొమాటోలో పనిచేసే బైక్ ట్యాక్సీ డ్రైవర్లుగా గుర్తించారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవులు తరలిస్తున్నారని ఘర్షణ

శంషాబాద్: అక్రమంగా గోవులను తరలిస్తున్నారనే విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందానగర్ వైపు నుంచి ఓ వాహనాన్ని గో సంరక్షణకు సంబంధించిన వ్యక్తులు వెంబడించారు. సాతంరాయి వద్ద వాహనాన్ని ఆపి గొడవకు దిగారు. వాహనంలో ఉన్న వ్యక్తులు మరికొందరిని అక్కడికి రప్పించుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. గొడవకు దిగిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వరాలయంలో భక్తుల క్యూ

మహేశ్వరం: విద్యుత్ దీపాల వెలుగులో శివగంగ రాజరాజేశ్వరాలయం





ఆమనగల్లు: చెన్నారం మల్లికార్జునుడి కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం



శివమయం

ఓం నమఃశివ శివాయ.. హరహర మహాదేవ శంభో శంకర.. అంటూ భక్తజనం శైవక్షేత్రాలకు పోటెత్తారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు విచ్చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించారు.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా



చెన్నారం మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవంలో స్పీకర్, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆర్‌టీఆర్‌కు ఆన్‌లైన్ బిడ్డింగ్

నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్‌ఎండీఏ

- 28న టెండర్ దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 21న టెక్నికల్ బిడ్స్ ఓపెన్
- భూముల ధరలకు రెక్కలు



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పొడవు:	41.5 కిలోమీటర్లు
గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు విస్తీర్ణం:	100 మీటర్లు, ఆరు లైన్లు
ఫేజ్–1:	ఓఆర్‌ఆర్ రావిర్యాల–మీర్‌ఖాన్‌పేట వరకు (19.2కి.మీ)
ప్రాజెక్ట్ అంచనా:	రూ.1,665 కోట్లు
ఫేజ్–2:	మీర్‌ఖాన్‌పేట–ఆమన్‌గల్లు ఆర్‌ఆర్‌ఆర్ వరకు(22.30కి.మీ)
ప్రాజెక్ట్ అంచనా:	రూ.2,365 కోట్లు

ఫేజ్-1లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి(ఎకరాల్లో)
ఇబ్రహీంపట్నం	ఫిరోజ్‌గూడ	84	1.03
ఇబ్రహీంపట్నం	కొంగరకలాన్	361	55.05
మహేశ్వరం	కొంగరకుర్దు	278	53.20
కందుకూరు	లేమూరు	497	84.28
కందుకూరు	తిమ్మాపూర్	290	47.02
కందుకూరు	రాచలూరు	351	87.22
కందుకూరు	గుమ్మడవెల్లి	(రిజర్వ్‌డ్ ఫారెస్ట్)	32.11
కందుకూరు	పంజాగూడ	(టీఎస్‌ఐఐసీ)	18.33
కందుకూరు	మీర్‌ఖాన్‌పేట	48	62.08

ఫేజ్-2లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి(ఎకరాల్లో)
ఆమనగల్లు	ఆమనగల్లు	331	68.35
ఆమనగల్లు	ఆకుతోటపల్లి	229	83.35
యాచారం	కుర్మిద్ద	529	144.75
కడ్తాల్	కడ్తాల్	440	72.67
కడ్తాల్	ముద్వీన్	1287	184.76

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన రతన్ టాటా రోడ్డు (గ్రీన్ ఫీల్డ్ రేడియల్) నిర్మాణానికి ఆన్‌లైన్ టెక్నికల్ బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 28న ఆన్‌లైన్ ద్వారా టెండర్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్చి 21 వరకు ఈ టెక్నికల్ బిడ్స్‌ను తెరవనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను (మొత్తం 41.5 కిలో మీటర్ల రోడ్డుకు 4,725 మంది రైతుల నుంచి 1,004.22 ఎకరాల భూమి) చేపట్టిన విషయం విదితమే. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 14 గ్రామాల మీదుగా వెళ్లే ఈ రోడ్డును రెండు దశల్లో నిర్మించాలని నిర్ణయించారు. ఫేజ్–1లో ఓఆర్‌ఆర్ ఎగ్జిట్–13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.02 కిలోమీటర్లు రూ.1,665 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేయనున్నారు. ఫేజ్–2లో భాగంగా మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు ఆర్‌ఆర్‌ఆర్ వరకు 22.30 కిలోమీటర్లు రూ.2,365 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఈ ఆర్‌టీఆర్(రతన్ టాటా రోడ్డు)కు టెండర్లు కాల్‌ఫర్ చేయడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది.

పొదుపు.. బిల్లు అదుపు

గ్రేటర్ పరిధిలో 60 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు

- ప్రస్తుతం 10 లక్షలకుపైగా కనెక్షన్లకే గృహజ్యోతి వర్తింపు
- వేసవిలో భారీగా పెరగనున్న గృహ విద్యుత్ వినియోగం
- టారీఫ్ మారితే.. జీరో బిల్లు అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం
- కరెంట్ పొదుపుగా వాడి బిల్లులను అదుపు చేయవచ్చంటున్న నిపుణులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: శివరాత్రితో చలి తీవ్రత తగ్గిపోనుంది. పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 35 డిగ్రీలు దాటింది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడైంది. ఉపశమనం కోసం సిటిజన్లు పేద, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఏసీలు, కూలర్లు కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటికే రిఫ్రిజిరేటర్, వాటర్ హీటర్, మిక్సీ, టీవీ, ఫ్యాన్ వాడకంతో నెలకు 120 నుంచి 150 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవారు.. తాజాగా ఏసీలు, కూలర్లు వినియోగించనుండటంతో మీటర్ రీడింగ్ గిర్రున తిరిగే అవకాశం లేకపోలేదు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం 2024 మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లులు (గృహజ్యోతి పథకం) జారీ చేస్తున్న విషయం తెలిసిందే. గ్రేటర్‌లో 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 10,03,286 కనెక్షన్లు మాత్రమే జీరో బిల్లుకు అర్హత పొందారు. వీరు ప్రతి నెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఇందుకు సంబంధించిన రాయితీ మొత్తం రూ.38.62 కోట్లు ప్రభుత్వం డిస్కంకు చెల్లిస్తోంది. ఇక నుంచి రోజువారీ విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టకపోతే.. నిర్దేశిత టారీఫ్ దాటి ఇప్పటి వరకు పొందిన జీరో బిల్లును కోల్పోయే ప్రమాదం లేకపోలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ చిట్కాలు పాటించండి..

చిన్న చిన్న చిట్కాలు పాటించడం వల్ల విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చంటున్నారు నిపుణులు. హాల్ నుంచి గదిలోకి వెళ్లినప్పుడు టీవీ, ఫ్యాన్, లైటు ఆఫ్ చేయడం, ఇప్పటి వరకు ఆన్‌లో ఉన్న గ్రీజర్‌కు ఇకపై స్వస్తి పలకడం, వేడి నీటితో కాకుండా చన్నీటితో స్నానం చేయడం వల్ల కరెంట్ వినియోగం తగ్గించుకోవచ్చంటున్నారు. విద్యుత్ పొదుపుతోనే నెలవారీ విద్యుత్ బిల్లును అదుపులో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు.

సర్కిళ్ల వారీగా జీరో విద్యుత్ బిల్లులు ఇలా..

సర్కిల్ పేరు	జీరో బిల్లు కనెక్షన్లు	ఇస్తున్న రాయితీ	విద్యుత్ వినియోగం
బంజారాహిల్స్	32,855	రూ.1.57 కోట్లు	3.56 ఎంయూలు
హైదరాబాద్ సెంట్రల్	62,709	రూ.2.84 కోట్లు	6.49 ఎంయూలు
హైదరాబాద్ సౌత్	92,573	రూ.3.53 కోట్లు	8.18 ఎంయూలు
సికింద్రాబాద్	66,909	రూ.2.97 కోట్లు	6.82 ఎంయూలు
సైబర్ సిటీ	68,073	రూ.2.67 కోట్లు	6.14 ఎంయూలు
రాజేంద్రనగర్	1,29,387	రూ.4.04 కోట్లు	9.04 ఎంయూలు
సరూర్‌నగర్	1,10,000	రూ.4.48 కోట్లు	10.31 ఎంయూలు
హబ్సిగూడ	1,21,417	రూ.5.39 కోట్లు	12.35 ఎంయూలు
మేడ్చల్	1,09,613	రూ.4.94 కోట్లు	11.32 ఎంయూలు
సంగారెడ్డి	2,09,743	రూ.6.19 కోట్లు	14.82 ఎంయూలు



చెక్కులు అందుకున్న విద్యార్థులకు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో కేఎస్.రత్నం తదితరులు

విద్యాభివృద్ధికి సహకారం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: విద్యాభివృద్ధికి ఎల్లవేళలా తనవంతు సహకారం ఉంటుందని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ప్రతిభ చూపుతున్న 60 మంది విద్యార్థులకు రూ.2,500 చొప్పున చెక్కులు అందజేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ద్వారా ప్రతీ సంవత్సరం ఆర్థికసాయం అందజేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు శిక్షణా తరగతుల నిర్వహణకు రూ.2లక్షల సాయం ప్రకటించారు. ప్రతీ ఒక్కరు చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి. యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, శర్వలింగం, వెంకట్‌రెడ్డి, మానిక్యరెడ్డి, శ్రీనివాస్, ఇంద్రాసేనారెడ్డి, ఆంజనేయులుగౌడ్, కృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, జయసింహ, అభిలాష్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీను, మహేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ

- రైతులకు మూడేళ్లుగా లీగల్ నోటీసులు
- పరిహారం, ప్లాట్లు తీసుకున్నా బకాయిల చెల్లింపులో జాప్యం
- యాచారం పీఏసీఎస్‌లో రూ.55లక్షల మొండిబకాయిలు



ఓ రైతు ఇంటి నుంచి బైక్‌ను లాక్కెళ్తున్న యాచారం పీఏసీఎస్ అధికారులు(ఫైల్)

యాచారం: అప్పులు చెల్లిస్తారా..? పరువు తీయమంటారా అంటూ యాచారం పీఏసీఎస్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు లీగల్ నోటీసులిచ్చినా రైతుల నుంచి స్పందన కరువైంది. దీంతో నేరుగా వాళ్ల ఇళ్ల వద్దకు వెళ్లి కార్లు, బైక్‌లు, ఇతర విలువైన సామగ్రి లాక్కెళ్లేందుకు యత్నిస్తున్నారు.

పరిహారం స్వీకరించిన రైతులు

యాచారం పీఏసీఎస్‌లో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 140 మంది రైతులు పట్టదారు పాస్‌పుస్తకాలు తాకట్టు పెట్టి రూ.కోటిన్నరకు పైగా దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు పొందారు. ఈ క్రమంలో 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ నాలుగు గ్రామాల్లోని రైతుల నుంచి 9,500 ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూమిని ఫార్మాసిటీ ఏర్పాటుకు సేకరించింది. ఆ తర్వాత వారికి ఎకరాకు రూ.12.50లక్షల పరిహారం అందజేసింది.

స్పెషల్ డ్రైవ్

భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా యాచారం పీఏసీఎస్ అధికారులు రైతుల పేరిట బకాయిలున్నాయని.. వాటిని చెల్లించేలా చూడాలని అప్పటి కలెక్టర్, టీఎస్‌ఐఐసీ అధికారులకు లేఖలు రాశారు. కానీ వారు ఖాతరు చేయలేదు. నేరుగా రైతులకే పరిహారం చెక్కులు అందజేశారు. చెక్కులు పొందిన రైతుల ఇళ్ల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. తదనంతరం ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు తలొగ్గిన పీఏసీఎస్ అధికారులు అప్పుల వసూలు విషయంలో వెనుకడుగు వేశారు. ప్రస్తుతం 1964 యాక్ట్ ప్రకారం ఇది వరకే లీగల్ నోటీసులు ఇచ్చిన స్పందన లేని రైతుల వద్ద నుంచి రికవరీ చేయడం కోసం డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్ రావు ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

ఒత్తిడి పెంచిన పీఏసీఎస్

మూడేళ్లుగా లీగల్ నోటీసులు అందుకున్న రైతుల్లోని కొందరు అప్పులు చెల్లించుస్తున్నారు. 140 మంది రైతుల్లో దాదాపు 45 మంది రైతులు ఇంకా రూ.55లక్షల బకాయి చెల్లించలేకపోతున్నారు. కొందరు రైతులు ప్లాట్లను అమ్ముకుంటుండడంతో ఇప్పుడు ఒత్తిడి పెంచకపోతే రికవరీ చేయలేమని యాచారం పీఏసీఎస్ అధికారులు భావిస్తున్నారు.

అప్పులు మాఫీ చేయాలి



జీవనోపాధికి ఉన్న భూములను ఫార్మాసిటీకి ఇచ్చేశారు. పరిహారం సైతం తక్కువే ఇచ్చారు. సర్కార్ రైతుల బాధలను పరిగణలోకి తీసుకుని అప్పులు మాఫీ చేయాలి. త్యాగం చేసిన రైతుల నుంచి రికవరీ పేరిట కార్లు, బైక్‌లు, విలువైన సామగ్రి లాక్కెళ్లడం సరికాదు.

– పాశ్చ భాషా, పీఏసీఎస్ డైరెక్టర్, నక్కర్తమేడిపల్లి

చెల్లించాల్సిందే..



ఫార్మాసిటీకి భూములు సేకరించే సమయంలోనే పీఏసీఎస్‌లో అప్పులు పొందిన రైతుల వివరాలను కలెక్టర్లు, టీఎస్‌ఐఐసీ అధికారులకు ఇచ్చాం. అప్పట్లో పట్టించుకోలేదు. మూడేళ్లుగా లీగల్ నోటీసులు ఇస్తున్నాం. స్పందన లేకపోవడంతోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడ్డమల్లయ్యగూడలో బైక్‌ను తీసుకొచ్చాం. వారు త్వరగా అప్పులు చెల్లించాలని తప్పితే పరువు తీయడం మాఉద్దేశం కాదు.

– నాగరాజు, సీఈఓ, యాచారం పీఏసీఎస్

ఉపాధిహామీ పనులను ప్రారంభించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

పరిగి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో వెంటనే ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఆత్మీయభరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇష్టానుసారంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఉపాధి కూలీలకు పని దినాలను 200 రోజులకు పెంచి ప్రతీ రోజు రూ.600 చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో ఉపాధి పనులను నిర్వహించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, నాయకులు సత్తయ్య, రఘురాం, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.


200 పనిదినాలు కల్పించాలి...

మర్పల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉపాధి కూలీలకు ప్రతి సంవత్సరం 200 పనిదినాలు కల్పించాలని, రోజువారి కూలి రూ. 600లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సిరిపూరం గ్రామంలో సీపీఎం శాఖ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాసయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ మైపాల్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నిరుపేదలకు ఇండ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.20లక్షలు ప్రభుత్వం అందజేయాలన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లను అభివృద్ధి పర్చాలన్నారు. కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మరావు, ఎన్ బాబు, కే బాబు, మాణయ్య, కృష్ణ, ఆంజనేయులు, పాండు, జైపాల్ పాల్గొన్నారు.

‘శివన్నగూడ’కు మరోసారి భూసేకరణ

ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం

మంచాల: శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా మరోసారి ప్రభుత్వం భూసేకరణ చేయనుంది. అందుకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా శివన్నగూడ రిజర్వాయర్ కోసం మంచాల మండల రెవెన్యూ పరిధి శ్రీమంత్‌గూడలో భూసేకరణ చేయనుంది. ఇక్కడ 267 మంది రైతులకు సంబంధించిన సర్వే నంబర్ 40 నుంచి 66లో గల 148.31 ఎకరాలను సేకరించనుంది. కేంద్ర భూసేకరణ చట్టం 2013 ప్రకారం నిర్వాసితులకు పునరావాస కల్పన కోసం నష్ట పరిహారం చెల్లించనున్నట్లు తెలిపింది. అదే విధంగా ఆ భూముల్లో సర్వే అనంతరం, కొలతలు తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూ సేకరణలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. 60 రోజుల్లోగా మంచాల తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం లేదా రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలపాలని కోరింది.



శివన్నగూడ రిజర్వాయర్

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

వెంగళరావునగర్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం... మధురానగర్ పీఎస్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్టుగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీసులు, హెచ్ఎన్ఈడబ్ల్యూ సిబ్బందితో కలిసి పకడ్బందీగా వల పన్నారు. ఈ మేరకు మంగళవారంరాత్రి వెంగళరావునగర్ డివిజన్‌లోని నలందా కళాశాల పక్కన ఉన్న గ్రౌండ్‌లో ముగ్గురు అనుమానితులను పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 41 కిలోల గంజాయి, రూ.40 వేల నగదు, గంజాయి ప్యాకింగ్ మెటీరియల్ లభించాయి. పోలీసులు వారిని అదుపులోనికి తీసుకుని గంజాయి, నగదు, మెటీరియల్‌ను సీజ్ చేశారు. కాగా, ముగ్గురిలో ఒకరు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ ప్రాంతానికి చెందిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ బాల హంతాల్‌గా గుర్తించారు. మరో ఇరువురు బుర్రా శ్రీనివాసులు, గోనుగుంట అభిషేక్‌లని, వీరిది కూకట్‌పల్లి ప్రాంతమని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను బుధవారం కోర్టుకు హాజరుపరిచి, అనంతరం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నిందితులతో మధురానగర్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

బరిలో ఉందామా.. వద్దా?



రాజకీయం అంటే ఖద్దరు కాదు.. దాని వెనక దాగున్న గాధలు వింటే ఎవరికైనా అయ్యో అనిపించక తప్పదు. ప్రజాసేవ చేయాలన్న తపనతో కొందరు ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటికీ.. రాజకీయ మర్మం తెలియక పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నారు. కోట్లు కూడబెట్టిన వారు లేకపోలేదు. కానీ దానికంటే ఆస్తులు పోగొట్టుకున్న వారే అధికం. అందుకే చాలా మంది బరిలో ఉందామా.. వద్దా అనే ఆలోచనలో ఉన్నారు.

మల్లగుల్లాలు పడుతున్న నాయకులు

- ప్రత్యక్ష రాజకీయాల్లో నష్టపోతున్న వైనం
- ప్రజాసేవ పేరుతో ఆస్తుల తనఖా
- కోట్లు పోగొట్టుకుని ఖద్దరు మాటున కలత
- కుటుంబ పోషణకై కూలీ పనులకు!

బడంగ్‌పేట్: ఒకప్పుడు ఖద్దర్ చొక్కా వేసుకుని నడుస్తుంటే ప్రజలు వంగివంగి దండాలు పెట్టేవారు. అప్పుడు ఆ నాయకులు విలువలకు కట్టుబడి ఉండేవారు. ప్రజలతో అన్యోన్యంగా మెదిలేవారు. నిత్యం వారి మధ్యే ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత నాయకులకు దణ్ణం సంగతి ఎలా ఉన్నా.. అసలు వారిని ప్రజలు నమ్మే స్థితి లేకుండా పోయింది. అందుకు కారణం రాజకీయం అంటే దోచుకోవడం.. దాచుకోవడమే నాయకుల పనని ఆరోపించే వారు అనేకం. మరో కోణంలో అందుకు భిన్నమైన పరిస్థితుల్లో నలిగి పోతున్నవారు లేకపోలేదు. ఉన్న ఊరికి, సమాజానికి మంచి చెద్దామని ప్రజా సేవంటూ ప్రత్యక్ష రాజకీయాల్లో దిగుతున్న వారు.. తమ జీవనశైలితో పాటు, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఒచ్చిందిలేదు. ఒరిగిందేమీలేదు. కానీ.. ఉన్నవి పోగొట్టుకుంటున్నారు.

జీవనపోరాటం

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు కాకముందు.. కార్పొరేషన్‌లో విలీనం అయిన నాదర్‌గుల్, బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, కుర్మల్‌గూడ, మామిడిపల్లి, బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, బాలాపూర్ పార్ట్ ఇలా 9 గ్రామాలు, ఆమ్లెట్ విలేజిలు కలిపి 2013లో నగర పంచాయతీని ఏర్పాటు చేశారు. అలా అప్‌గ్రేడ్ పొందుతూ.. నేడు రాష్ట్రంలోనే ఆదాయంలో రెండో కార్పొరేషన్‌గా పేరు గాంచింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రత్యక్ష రాజకీయాల్లో దిగి, ప్రజాసేవలో ఆస్తులు కూడబెట్టుకున్నవారు ఉన్నప్పటికీ.. కరగదీసుకున్న వారే అధికం. వార్డు సభ్యుల నుంచి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా ప్రజాధరణ పొందినప్పటికీ.. ఆర్థికంగా నష్టపోయారు. ఇక ఎదగలేమని తెలిసి సెక్యూరిటీ గార్డులుగా, కూలీ పనులు, వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

బూడిద పాలు

32 డివిజన్లుగా కొనసాగుతున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్లలో కొందరు.. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ కోట్లు కూడబెట్టుకున్నారనే విమర్శలు లేకపోలేదు. ఐదేళ్ల క్రితం కార్పొరేటర్లు బరిలో ఓడినవారు, గెలిచిన వారిలో ఆర్థికంగా ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారన్నదే వాస్తవం. ఏదో ఒక విధంగా ఎత్తుకు పై ఎత్తు వేసి, కేవలం 3500 ఓట్లకు రూ.1.50, రూ.2 కోట్లు ఖర్చు పెట్టి విజయం సాధించిన వారు సైతం, ఐదేళ్ల పెట్టుబడి అంతా బూడిద పాలు అయిందని వాపోతున్నారు.

కోట్లు పెట్టినా.. గ్యారంటీ లేదు

కౌన్సిలర్లుగా బరిలో నిలిచి రూ.50 లక్షలకు పైగా పోగొట్టుకున్నాము. కార్పొరేటర్లుగా బరిలో దిగి రూ.కొటిన్నర నుంచి రెండు కోట్లు వెచ్చించాము. ఈ సారి బడంగ్‌పేట కార్పొరేషన్ గ్రేటర్లో విలీనం అవుతుందనేది పక్కా సమాచారం. ఈ లెక్కన 20 వేల నుంచి 25 వేల వరకు ఓటర్లు ఉంటారు. అంటే ఈ సారి ఎంత లేదనుకున్నా.. రూ.4 కోట్లు ఖర్చు పెట్టాల్సిందే. పెట్టుబడి పెట్టి అంతకు నాలు గింతలు తీసే చీకటి నాయకులు ఉన్నారు. ఇది అందరికీ కలిసి రాదు. అన్ని కోట్లు పెట్టి ఖద్దరు చొక్కను కాపాడుకునే బదులు.. అదే డబ్బును వ్యాపారంలో తిప్పితే లాభాలు వస్తాయని పలువురు రాజకీయ నాయకులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. అన్ని కోట్లు పెట్టినా జనాలు ఆదరిస్తారనే గ్యారంటీ లేదు. ఎందుకొచ్చిన తలనొప్పని ఆలోచనలో పడ్డారు. అందుకే పోటీ చెద్దామా వద్దా అని మల్లగుల్లాలు పడుతున్నారు.

ప్రిస్టేజీ కోసం.. ఖర్చు

రూ.కోట్లు పెట్టి గెలిచిన వారిలో చాలా మంది.. స్టేటస్ సింబల్ కోసం, పెద్ద కార్లు, డ్రైవర్లు, మెయింటనెన్స్, అనుచరులు అంటూ నెలనెలా ఉల్లాగా రూ.70 వేలకు పైగా ఖర్చవుతుందని వాపోతున్నారు. ఇవే కాక వివాహాలు, చావులు, పండుగలు, చందాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, విరాళాల పేరుతో జేబులు ఖాళీ చేసుకుంటున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇలా తనకున్న పరిస్థితులను బయటకు చెప్పుకోలేక, ఖద్దరు చొక్కా మాటున అనేక మంది కుంగిపోతున్నారు. ఇవే గాక గ్రామాలు, కాలనీల్లో రాజుకుంటున్న ఇరు వర్గాల పంచాయితీలు, పోలీస్ స్టేషన్ల మధ్యవర్తిగా ఉండటం కూడా లీడర్‌కు తలనొప్పిగా మారింది. ఇవన్నీ చేసుకుంటూ.. నిత్యం రాజకీయాలంటూ తిరుగుతున్నారు. కుటుంబానికి సమయం ఇవ్వకుండా.. ఎక్కడ ప్రిస్టేజీ దెబ్బతింటుందోనని.. ఆస్తులను కుదువపెట్టి ఖద్దరు చొక్కాను కాపాడుకుంటున్నవారు చాలా మదే ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు దుర్మరణం చెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సరూర్‌నగర్‌కు చెందిన జయమ్మ(67) కుటుంబ సభ్యులతో కలిసి అచ్చంపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో కాటన్‌మిల్లు వద్ద వృద్ధురాలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు దాటుతుండగా నగరం నుంచి బైక్ పై వేగంగా వచ్చిన ఎండీ ఆసిమ్ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబీకులు వెల్దండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువతి పై కుక్కల దాడి



దాడిలో కింద పడిన యువతి వృత్తంలో

షాద్‌నగర్: రోడ్డు పై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువతి పై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటన షాద్‌నగర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మల్లికార్జున కాలనీలో నివాసం ఉంటున్న మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్ కూతురు సోమవారం సాయంత్రం పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఇంటి ముందున్న రహదారి గుండా నడుచుకుంటూ వెళ్తుండగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమె పై దాడి చేశాయి. వాటి బారి నుంచి తప్పించునే క్రమంలో పరుగులు తీయగా.. యువతి కింద పడింది. దీంతో ఆమెకు స్వల్ప గాయలయ్యాయి. వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని పట్టణ ప్రజలు డిమాండ్ కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొందుర్గు: బావమరుదులు తనపై దాడిచేశారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ సంఘటన మండల పరిధి పర్వతాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోలుకట్టి మల్లేశ్(38) పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన చిట్టెమ్మను వివాహం చేసుకున్నాడు. నాటి నుంచి వారిద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం దంపతులు గ్రామం వదిలేసి, షాద్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అక్కడ గొడవలు పెరగడంతో.. విషయాన్ని చిట్టెమ్మ తన సోదురులు శ్రీనివాసు, అమరేందర్‌లకు తెలిపింది. దీంతో ఈ నెల 25న వారిద్దరు మల్లేశ్‌పై దాడిచేశారు. దీంతో మనస్తాపం చెందిన మల్లేశ్.. పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి పెద్ద సత్యమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విధులకు డుమ్మా.. వేతనం విత్ డ్రా

పనిచేయకుండా.. జీతం తీసుకున్న టీచర్

తుక్కుగూడ: మూడు నెలలుగా విధులకు వెళ్లకుండా.. ఓ టీచర్ నెలనెలా వేతనం తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో.. సుగుణ ఉపాధ్యాయురాలుగా పని చేస్తోంది. ఈమె గతేడాది నవంబర్ 2 నుంచి అర్హత కలిగిన సెలవులు ఉన్నాయంటూ లీవు పెట్టింది. అప్పటి నుంచి ఈ నెల 19 వరకు పాఠశాలకు వెళ్లలేదు. డిసెంబర్ 23న ఒక్క రోజు బడికి వచ్చి పోయారు. అయినా ఆమె వేతనం పొందింది. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా సెలవులో ఉంటే నిబంధనల ప్రకారం.. వేతనం ఇవ్వరు. వారి లీవులు పూర్తియి, విధుల్లో చేరినప్పుడు మాత్రమే జీతం తీసుకోవాలి. కానీ సదరు ఉపాధ్యాయురాలు విధులకు హాజరు కాకున్నా.. వేతనం పొందారు. ఉపాధ్యాయులు వేతనం పొందాలంటే వారి పరిధిలోని క్లాంపెక్స్ ప్రధానోప్యాధాయులు సంతకం చేయాల్సి ఉంటుంది. ఆమె విధుల్లో పాల్గొనకున్నా.. తుక్కుగూడ జిల్లా పరిషత్ హెచ్ఎం, కాంప్లెక్స్ హెచ్ఎం కంబాలపల్లి రాములు అనుమతితో వేతనం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సుగణకు హెచ్ఎం రాములు బంధువు కావడంతో వేతనం వచ్చేలా చేశారని ఆరోపిస్తూ.. అతడి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



లీవ్‌లో ఉన్నారు

మా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు సుగణ.. గత ఏడాది నవంబర్ 2 నుంచి ఈ ఫిబ్రవరి 19 వరకు లీవ్‌లో ఉన్నారు. ఈ మూడు నెలలో కాలంలో కేవలం డిసెంబర్ 23న పాఠశాలకు వచ్చారు. ఆమెకు ప్రతి రోజు హాజరు పట్టికలో లీవ్ వేస్తున్నాము. అయినా ఆమె వేతనం పొందిన విషయం మాకు ఆలస్యంగా తెలిసింది.

– సుజాత, హెచ్ఎం, రావిర్యాల ప్రాథమిక పాఠశాల

రికవరీ చేస్తాం

రావిర్యాల పాఠశాల ఉపాధ్యాయురాలు మూడు నెలల నుంచి విధులకు హాజరుకాకున్నా వేతనం పొందిన విషయం వాస్తవమే. ఉపాధ్యాయులు లీవ్‌లో ఉన్నప్పుడు వేతనం ఇవ్వకూడదు. తుక్కుగూడ కాంప్లెక్స్ హెచ్ఎం వేతనం ఇచ్చారు. డీఈఓ ఆదేశాల మేరకు తీసుకున్న జతం రికవరీ చేస్తాం.

– కస్నా నాయక్, ఎంఈఓ, మహేశ్వరం మండలం

కంపెనీలో నిధుల దుర్వినియోగం

- నలుగురిపై కేసు
- ఇద్దరి రిమాండ్ పరారీలో మరో ఇద్దరు



విట్టల్ రాంజీ హుండాలే



శివాజీ పరాశరం బింగాలే

నాగోలు: కంపెనీ నిధులు దుర్వినియోగం చేయడమేగాక, మేనేజింగ్ డైరెక్టర్‌పై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సతీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్ ప్రాంతంలోని హన్వికా ఆర్గానిక్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మహారాష్ట్రకు చెందిన విట్టల్ రాంజీ హుండాలే, అదే ప్రాంతాన్ని చెందిన శివాజీ పరాశరం బింగాలే మరో ఇద్దరితో కలిసి ఏర్పాటు చేశారు. సంస్థలో గోడౌన్ బాధ్యతలు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులు కంపెనీ స్టాక్, నిధులను వారి సొంత వ్యాపారానికి బదిలీ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నాగేశ్వరరావు నిధుల దుర్వినియోగంపై నిలదీయగా సిబ్బందితో అతడిపై దాడి చేయించారు. నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కంపెనీ నిధులు, స్టాక్‌ను నలుగురూ కలిసి తమ సొంత సంస్థ అయిన మెస్సర్స్ డాన్వి అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మళ్లించినట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి కంపెనీ మాజీ ఉద్యోగులైన విట్టల్ రాంజీ హుండాలే, శివాజీ పరాశరం బింగాలేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

ప్రేమ పేరుతో విద్యార్థినికి వేధింపులు

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమ పేరుతో వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గూల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న (15) బాలికను ఇదే స్కూల్‌లో పనిచేస్తున్న ఫిజిక్స్ టీచర్ మహేశ్ కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని తరచూ మాట్లాడాడు. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించాడు. అనంతరం బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. ఈనెల 24న బాలిక ఏడ్చుకుంటూ వచ్చి, తనకు స్కూల్‌కు వెళ్లాలని లేదని, ఉపాధ్యాయుడు మహేశ్ వేధింపులకు గురి చేస్తున్నాడని చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఈనెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మహేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం అతన్ని న్యాయస్థానంలో ప్రవేశపెట్టి, రిమాండ్‌కు తరలించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన.. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుణాత్మక విద్యనందించాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ

పహాడీషరీఫ్: విద్యార్థులు బాల్యం నుంచే చదువుతో పాటు సంస్కారాన్ని నేర్చుకోవాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట సక్సెస్ స్టార్ స్కూల్ వార్షికోత్సవం మంగళవారం రాత్రి స్థానిక గ్రేస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తారీఖ్ అన్సారీ మాట్లాడుతూ.. విద్యనభ్యసించడం ద్వారానే సమాజంలో అన్ని రకాలుగా గౌరవం లభిస్తుందన్నారు. పాఠశాలల యజమాన్యాలు కూడా గుణాత్మకమైన విద్యను బోధించడం దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బాడీ బిల్డర్ మీర్ మోతేషాం అలీ ఖాన్, పాఠశాల డైరెక్టర్ మహ్మద్ షుజావుద్దీన్, కరస్పాండెంట్ అతియా ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నిందితుల రిమాండ్



చోరీ కేసు నిందితులతో పోలీసులు

ఉప్పల్: చోరీ కేసు నిందితులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి సొత్తును రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్ఞాన్ చంద్‌శర్మ, రామ్ కిశోర్ ఇద్దరు ఉప్పల్ గాంధీనగర్‌లో నామన్ మార్కెటింగ్ హోల్‌సేల్ కిరాణా షాపును 8 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈనెల 22న రాత్రి రామ్‌కిశోర్ షాపును మూసేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు హమాలీ రాజు షాపు తెరిచి ఉండడాన్ని గమనించి షాప్ యజమానికి సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న షాపు యజమానులు లోనికి వెళ్లి గల్లా పెట్టెలో చూడగా అందులోని రూ. 7 లక్షలు కనిపించలేదు. దీంతో వెంటనే ఉప్పల్ పోలీసులను ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా నిందితులు చోరీకి ముందు షాపు బయట ఉన్న సీసీ కెమెరాలను పక్కకు వంచారు. కానీ షాపులోపల కెమెరాలను గమనించలేదు. దీంతో దొంగతనం దృశ్యాలు సీసీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. వాటి ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఉప్పల్ పోలీసులు బుధవారం రాజ్యలక్ష్మీ థియేటర్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతన లేని సమాధానం చెప్పారు. వారిని స్టేషన్ తీసుకెళ్లి విచారించగా వికారాబాద్‌కు చెందిన మహ్మద్ ఖాదర్ (48), అబ్దుల్ ఖాలీద్ (48), రాజేందర్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ మొయిన్ (42) ఉప్పల్‌లో దొంగతానికి పాల్పడినట్లు అంగీకరించారు. వీరు ఇప్పటికే పలు చోరీ కేసుల్లో నిందితులని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి రూ. 5,20,000 లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.